# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :142 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 08-08-2025 | పేజీలు:4 వెల: 2.00


## ధరాలీలో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

న్యూఢిల్లీ,ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలోని ధరాలీ గ్రామంలో సంభవించిన జలప్రళయంలో ఇండ్లకు ఇండ్లే కొట్టుకుపోయాయి. ఆ ఇండ్ల స్థానంలో భారీగా బురద పేరుకుపోయింది. ప్రళయంలో ఇప్పటికే నలుగురు మరణించారు. దాదాపు 60 మంది గల్లంతయ్యారు. దాంతో గల్లంతైన వారి ఆచూకీ కోసం ఇండియన్ ఆర్మీ గాలిస్తోంది. మంగళవారం క్లౌడ్‌బస్ట్ కారణంగా ఖీర్ గంగా నది ఉప్పొంగింది. దాంతో నది పక్కనే ఉన్న ధరాలీ గ్రామాన్ని వరద ముంచెత్తింది. అకస్మాత్తుగా వచ్చిన వరదతో ఆ గ్రామంలో ఇళ్లకుఇళ్లే కొట్టుకుపోయాయి. పలు ఇళ్లను బురద కప్పేసింది. భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఊహించని జలప్రళయంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఈ విపత్తువల్ల ధరాలీ గ్రామానికి చెందిన దాదాపు 60 మంది గల్లంతయ్యారు. నలుగురు మృతిచెందారు. సమాచారం అందుకున్న ఆర్మీ, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. కూడా రెస్క్యూ టీమ్స్ గాలింపులు కొనసాగిస్తున్నాయి.

## చర్చనీయాంశంగా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు



హైదరాబాద్,మంత్రి కొండా సురేఖ తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం.. ఆ వ్యాఖ్యలకు వివరణ ఇచ్చుకోవడం రొటీన్‌గా మారిపోయింది. గతంలో ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కొండా సురేఖ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. కొండా సురేఖ చేసిన ఆరోపణలు నిరాధారమని కేటీఆర్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ కేసులో మంత్రి కొండా సురేఖపై కేసు నమోదు చేయాలని కోర్టు పోలీసులను ఆదేశించింది.తెలంగాణ మంత్రి కొండా సురేఖ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారు. ఇప్పటివరకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివాదాలను రాజేసిన కొండా సురేఖ ఇప్పుడు దేశంపై పడ్డారు. ఏకంగా దేశ ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీరిజర్వేషన్ల పెంపుకు ఆమోదం తెలపాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ ఢిల్లీలో నిర్వహించిన ధర్నాలో ప్రధాని మోదీ, బీజేపీని టార్గెట్ చేశారు కొండా సురేఖ. నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి అత్యున్నత పదవిలో ఉన్న రాష్ట్రపతిని బీజేపీ ప్రభుత్వం ఆహ్వానించలేదని%ా% ఆమె వితంతువు కాబట్టే మోదీ పిలవలేదని కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పిలవలేదనిఆమె గిరిజన మహిళ కాబట్టే ఇక్కడికి కూడా మోదీ సర్కార్ రానివ్వలేదన్నారు కొండా సురేఖ.రాష్ట్రపతిని ఉద్దేశించి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతికి కొండా సురేఖ క్షమాపణలు చెప్పాలని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ డిమాండ్ చేశారు. కొండ సురేఖకు రాజకీయ పరిజ్ఞానం లేక ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు.మంత్రి కొండా సురేఖ తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం.. ఆ వ్యాఖ్యలకు వివరణ ఇచ్చుకోవడం రొటీన్‌గా మారిపోయింది. గతంలో ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కొండా సురేఖ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. కొండా సురేఖ చేసిన ఆరోపణలు నిరాధారమని కేటీఆర్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ కేసులో మంత్రి కొండా సురేఖపై కేసు నమోదు చేయాలని కోర్టు పోలీసులను ఆదేశించింది. అంతే కాదు పైసలిస్తేనే మంత్రుల వద్ద ఫైల్స్ క్లియరవుతాయి అంటూ కొన్ని నెలల క్రితం కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. మంత్రి కొండా సురేఖ చేస్తున్న కామెంట్స్ పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతున్న నేపథ్యంలో ఈ కాంట్రవర్సీలకు కాంగ్రెస్ ఎలా చెక్ పెడుతుందో చూడాలి.

## రాజ్‌గోపాల్ రెడ్డిపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నజర్



నల్గొండ, కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డిపై క్రమశిక్షణ కమిటీ నజర్ అయింది. రాజ్‌గోపాల్ రెడ్డితో ఫోన్‌లో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి మాట్లాడనున్నారు. తరచూగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై విమర్శలు చేస్తున్నారు రాజ్‌గోపాల్ రెడ్డి.ఎమ్మెల్యే చేస్తున్న వ్యాఖ్యల వల్ల ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కి నష్టం కలుగుతోందని భావిస్తోంది క్రమశిక్షణ కమిటీ. ఈరోజు ఫోన్‌లో మాట్లాడి కమిటీతో మాట్లాడే వరకు సైలెంట్‌గా ఉండాలని మల్లు రవి రాజ్‌గోపాల్ రెడ్డికి చెప్పనున్నారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో తాను ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చినప్పుడు కూలంకషంగా చర్చిద్దామని రాజ్‌గోపాల్ రెడ్డికి సూచించనున్నారు మల్లు రవి. కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు కలిగిస్తే ఊరుకునేది లేదని మల్లు రవి స్పష్టం చేశారు.అయితే, గత కొంతకాలంగా రాజ్‌గోపాల్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారని రాజ్‌గోపాల్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో రేవంత్ వ్యాఖ్యలను ప్రతిసారి రాజ్‌గోపాల్ రెడ్డి తప్పుపడుతున్నారు. ఆయన వైఖరీ కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగిస్తోందని హస్తం పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో క్రమశిక్షణ కమిటీ కూడా రాజ్‌గోపాల్ రెడ్డిపై అసహనం వ్యక్తం చేసింది. రాజ్‌గోపాల్ రెడ్డితో మల్లు రవి మాట్లాడి ఈ విషయంలో ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## జర్నలిస్ట్ హత్య కేసు.. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు షూటర్లు మృతి..!



లక్నో:ఉత్తరప్రదేశ్ సీతాపూర్‌కు చెందిన జర్నలిస్ట్ రాఘవేంద్ర బాజ్‌పాయ్ హత్య కేసులో ఇద్దరు షూటర్లు హతమయ్యారు. పోలీసులకు, షూటర్లకు మధ్య ఎదురుకాల్పులు జరగ్గా.. పోలీసు తూటలకు తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. హత్య కేసులో షూటర్లపై ఒక్కొక్కరిపై రూ.లక్ష రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. మహోలికి చెందిన జర్నలిస్ట్ రాఘవేంద్ర జాజ్‌పాయ్ హత్య కేసులో వాంటెడ్ క్రిమినల్స్ అయిన సంజయ్ తివారీ, రాజు తివారీ, పోలీసులకు మధ్య గురువారం ఉదయం పిసావాన్‌లో ఎదురుకాల్పులు జరిగాయి. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చనిపోయినట్లు ప్రకటించారు.ఘటనపై ఎస్పీ అంకూర్ అగర్వాల్ మాట్లాడుతూ మహోలీ రోడ్‌లో పోలీసులు, ఎస్‌టీఎఫ్ సంయుక్త బృందంగా ఇద్దరి కోసం గాలింపు జరుపుతుండగా.. షూటర్లు సంజయ్ తివారీ, రాజు తివారీ బైక్‌పై వెళ్తున్నారని.. వారిని అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులపై కాల్పు జరిపారన్నారు. పోలీసులు సైతం కాల్పులు జరుపగా.. గాయాలకు గురయ్యారన్నారు. వారిని ఆసుపత్రికి తరలించగా వైద్యులు మరణించారని ప్రకటించారన్నారు. ఇద్దరిపై హత్యాయత్నం, హత్యలతో పాటు అనేక తీవ్రమైన కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ ఏడాది మార్చి 8న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో హేంపూర్ వంతెన వద్ద ఇద్దరు షూటర్లు జర్నలిస్ట్ రాఘవేంద్ర కాల్చి చంపారు. పోలీసులు ఈ కేసును 34 రోజుల్లోగా ఛేదించి ఓ పూజారి, మరో ఇద్దరిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ కేసులో ఇద్దరు షూటర్లు పరారీలో ఉండగా వారి కోసం గాలిస్తున్నారు. హత్యలో ఐదుగురు వ్యక్తులు పాల్గొన్నారని.. ఇందులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు.

## కాళేశ్వరం దోపిడిపై ఈడీ నజర్...



హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలో అతి పెద్ద కుంభకోణంగా పేరొందిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టులో పనిచేసిన ముగ్గురు ఇంజినీరింగ్ అధికారుల అక్రమార్జన బహిరంగ మార్కెట్ లో రూ.800 కోట్ల పైగా ఉన్నట్లు తెలంగాణఅవినీతి నిరోధక విభాగం ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. ఇప్పటికే ఈ కుంభకోణం పై ఏసీబీ విచారణ జరుగుతుండగా, త్వరలో ఈడీ రంగప్రవేశం చేసే అవకాశాలున్నాయి. ఈ ముగ్గురు అక్రమంగా అర్జించిన సొమ్మును పలు మార్గాలలో మళ్ళించడమే కాకుండా బినామీల పేర్ల మీద పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టారు. ఇందులో నిధుల మళ్లింపు వ్యవహారం ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ కింద వస్తుందనే విషయాన్ని ఈడీ పరిగణనలోకి తీసుకున్నది. దీంతో ముగ్గురిపై ఈసీఐఆర్ నమోదు కోసం తెలంగాణ ఏసీబీ నుంచి కేసు వివరాలు, డాక్యుమెంట్లు తెప్పించుకోవాలనే నిర్ణయానికి ఈడీ వచ్చింది.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరించి చక్రం తిప్పిన ఇంజనీరింగ్ అధికారులపై దాడులు నిర్వహించింది. ఇంజినీర్ ఇన్ ఛీఫ్ (రిటైర్డు) సి.మురళీధర్ రావు, కాళేశ్వరం కార్పొరేషన్ ఈడీ, ఇంజినీర్ ఇన్ ఛీఫ్ భూక్యా హరిరామ్, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ నూనె శ్రీధర్ నివాసాలు, కార్యాలయాలు, సన్నిహితుల ఇళ్లపై ఏసీబీ దాడులు చేసి విలువైన డాక్యుమెంట్లు, బంగారు ఆభరణాలు, లాకర్ల సమాచారం, బ్యాంకు డిపాజిట్లు, బినామీల పేర్లతో లావాదేవీలు వంటి ముఖ్యమైన దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిపై జూన్, జూలై నెలలో ఏసీబీ సోదాలు జరిపిన విషయం తెలిసిందే. వీరి ఆస్తుల విలువను బహిరంగ మార్కెట్ లో లెక్కించిన అధికారులు కంగుతిన్నారు. ముగ్గురు ఇంజినీరింగ్ అధికారులే ఇంత భారీ మొత్తంలో వందల కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులు కూడబెట్టారంటే, పై స్థాయిలో అవినీతి ఇంకా ఎక్కువగా ఉండవచ్చని నీటి పారుదల శాఖ సిబ్బంది చర్చించుకున్నారు. ఇలా అక్రమ మార్గంలో ఆర్జించిన సొమ్మును వివిధ మార్గాల్లో మళ్లించి దూరపు బంధువులు, స్నేహితులు, ఉద్యోగుల పేర్ల మీద పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టినట్లు ఈడీకి సమాచారం అందింది. ఏసీబీ నుంచి అందే అధికారిక వివరాల ఆధారంగా త్వరలోనే ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసే అవకాశముంది. కేసు నమోదు అయిన తరువాత పీఎంఎల్ఏ చట్టం ప్రకారం ఆరు నెలల వ్యవధిలో వారి ఆస్తులను జప్తు చేయనున్నారు. ఈ కేసు ముగ్గురికే పరిమితం అయ్యే పరిమితం అయ్యే పరిస్థితి లేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారుల మెడకు చుట్టుకోవం ఖాయంగా కన్పిస్తున్నది.

ఆ అధికారులపై వేటు పడేనా?

పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో దాదాపు రెండు వందల మంది అధికారులపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అలాగే కొంత మందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. దీంతో కాళేశ్వరం నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన ఆ అధికారులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న ఆస్తకి నెలకొన్నది. అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ అయిన ఎస్.కే. జోషి ప్రాజెక్టులో జరిగిన తీవ్రమైన లోపాలకు బాధ్యత వహించాలని పేర్కొంది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కార్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్‌పై కూడా చర్యలు తీసుకోవచ్చని వెల్లడించింది.వీరితో పాటు ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి, ఆర్థికశాఖ కార్యదర్శి, నీటిపారుదల శాఖ కార్యదర్శిలపై కూడా చర్యలు తీసుకోవాలని కమిషన్ తెలిపింది. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ బోర్డు మెంబర్స్ అందరిపై, ఈఎన్‌సీ సీ. మురళీధర్, హైపవర్ కమిటీ మెంబర్స్ ఈఎన్‌సీ ఎన్. వెంకటేశ్వర్లు, సీఈ బీ.హరిబాబు, సీఈ టీ.శ్రీనివాస్, సీఈ ఏ. నరేందర్ రెడ్డి, ఎస్ఈ కే.ఎస్.ఎస్. చంద్రశేఖర్, ఈఈ బసవరాజు, సీఈ జే. శ్రీదేవి, సీఈ జీ. రమేశ్, సీఈ జే. ఆశిర్వాదం, స్టేట్ లెవెల్ స్టాండింగ్ కమిటీ మెంబర్స్ ఈఎన్‌సీ జీ. అనిల్ కుమార్, ఈఎన్‌సీ బీ. నాగేందర్ రావు, సీఈ టీ. పరిమళ, సీఈ శంకర్ నాయక్ లపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది.

## ట్రంప్‌తో భేటీకానున్న రష్యా ప్రెసిడెంట్ పుతిన్.. భారత్‌పై సుంకాలు తగ్గుతాయా..



న్యూఢిల్లీ, రష్యా నుంచి చమురు కొనొద్దన్న తన హెచ్చరికలను పట్టించుకోని భారత్ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోత మోగించారు. భారత్ దిగుమతులపై ఇప్పటికే 25శాతం సుంకాలు విధించిన ట్రంప్.. తాజాగా.. దానిని 50శాతానికి పెంచారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. అయితే, గతంలో విధించిన 25శాతం సుంకాలు ఆగస్టు 7నుంచి అమల్లోకిరాగా.. అదనంగా పెంచిన 25శాతం సుంకాలు ఆగస్టు 27వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయని ట్రంప్ ప్రకటించారు. అయితే, యుక్రెయిన్ పై రష్యా యుద్ధాన్ని ఆపేస్తే భారత్ పై సుంకాలు తగ్గిస్తారా అని మీడియా ప్రశ్నించగా.. ట్రంప్ ఆసక్తికర సమాధానం ఇచ్చారు.యుక్రెయిన్ పై రష్యా యుద్ధాన్ని కొనసాగించడానికి భారత్ కారణమంటూ కొద్దిరోజులుగా డొనాల్డ్ ట్రంప్ అర్థంపర్థంలేని వాదన చేస్తున్న విషయం తెలిసిందే. రష్యా నుంచి పెద్దమొత్తంలో భారత్ చమురు నిల్వలు దిగుమతి చేసుకుంటుండంటం వల్లనే ఇలా జరుగుతుందని, భారత్ చమురు నిల్వలను దిగుమతి చేసుకోవటం నిలిపివేయాలంటూ ట్రంప్ హెచ్చరికలు చేశారు. అయితే, ట్రంప్ హెచ్చరికలను భారత్ పట్టించుకోకపోవడంతో భారత్ దిగుమతులపై భారీ సంకాలను విధించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ అవుతుండటం చర్చనీయాంశంగా మారింది.బుధవారం వైట్ హౌస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. వ్లాదిమిర్ పుతిన్‌తో త్వరలో భేటీ కాబోతున్నట్లు చెప్పారు. ఇప్పటికే యుక్రెయిన్ – రష్యా మధ్య యుద్ధాన్ని ముగించే ప్రణాళికతో ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ మాస్కోలో ఆ దేశ అధికారులతో సుమారు మూడు గంటలపాటు చర్చలు జరిపారు. చర్చలు సానుకూలంగా జరిగినట్లు ప్రకటించారు. ట్రంప్ కూడా ట్రూత్ సోషల్‌లో ట్వీట్ చేశారు. గొప్ప పురోగతి సాధించాం. ఈ యుద్ధం ఇక ముగించాల్సిందే అంటూ పేర్కొన్నాడు.వచ్చే వారంలో రష్యా అధ్యక్షుడు పుతిన్, యుక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్స్కీతో డొనాల్డ్ ట్రంప్ భేటీ అవుతారని వైట్ హౌస్ ప్రకటించింది. పుతిన్ తో చర్చించేందుకు ట్రంప్ సిద్ధంగా ఉన్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలీన్ లివిట్ పేర్కొన్నారు. ట్రంప్‌తో పుతిన్ భేటీ తరువాత యుక్రెయిన్ %–% రష్యా మధ్య యుద్ధం ముగింపుపై కీలక ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరిస్తే భారత్‌పై విధించిన సుంకాలు తగ్గుతాయా? అని ట్రంప్‌ను ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. దీనికి ట్రంప్ బదులిస్తూ.. అలా జరిగే అవకాశం ఉందని సూచనప్రాయంగా వెల్లడించారు. అయితే, దీనిపై తాము తర్వాత నిర్ణయం తీసుకుంటామని, ప్రస్తుతానికైతే భారత్ 50శాతం సుంకాలు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు.

## నేను దేనికైనా సిద్ధం.. రాహుల్ గాంధీకి కిషన్ రెడ్డి ఛాలెంజ్!



హైదరాబాద్,కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఛాలెంజ్ విసిరారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలో అయినా మరలా గెలిస్తే..తాను దేనికైనా సిద్ధం అని ఛాలెంజ్ చేశారు. కాంగ్రెస్ గెలిస్తే.. రాహుల్ ఏం చెప్పినా చేయడానికి తాను సిద్ధం అని చెప్పారు. కాంగ్రెస్ ఏ రాష్ట్రంలో తిరిగి వచ్చే అవకాశం లేదని, అడ్డంగా ఓడిపోవడం ఖాయం అని అన్నారు. సూర్యుడిపై ఉమ్మినట్లు.. ప్రధాని నరేంద్ర మోడీ గారిని కాంగ్రెస్ విమర్శిస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మరణ శాసనం రాశారు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పోరుబాట ధర్నాపై కిషన్ రెడ్డి స్పందించారు.‘తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో రాకముందు నుంచే అబద్ధాలు చెప్పింది. అమలు కానీ హామిల్చింది. ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల పేరుతో ఆశ చూపించి ప్రజలను మోసం చేసింది. చేతకాని తనంతో చేతులు ఎత్తేసి.. ఇచ్చిన హామీలు అమలు చెయ్యలేని పరిస్థితిలో ఉన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. తమ నిస్సహాయతను బీజేపీ, కేంద్రం, మోడీపై నెడుతున్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలకు రేవంత్ రెడ్డి మాత్రమే కాదు.. రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు కూడా పూర్తి బాధ్యత వహించాలి. ఎన్నో డిక్లరేషన్‌ల పేరుతో ఆయా వర్గాలను మోసం చేశారు. అధికారంలోకి వచ్చాక, ఏ డిక్లరేషన్‌ను డెడికేషన్‌తో అమలు చెయ్యడం లేదు. బీసీలకు లక్ష కోట్లు ఇస్తాం అన్నారు.. ఎందుకు ఇవ్వలేదు. డిల్లీ బాట పట్టి స్థాయికి మించి విమర్శలు చేస్తున్నారు. డిల్లీ ప్రదక్షణ తప్ప.. తెలంగాణకు రేవంత్ చేసిందేమీ లేదు’ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు.‘బీసీలకు ఇచ్చిన హామీల్లో ఏ హామీ కూడా అమలు చెయ్యడం లేదు. అద్దాల మేడలో కూర్చుని.. ఇతరుల మీద రాళ్ళు రువ్వే ప్రయత్నం చేస్తున్నారు. బీసీలకు సామాజిక సాధికారత కల్పించే ఆలోచన రేవంత్ రెడ్డికి లేదు. నిన్నటి ధర్నాలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను పొగడటం, మోదీని విమర్శించడానికే సరిపోయింది. రేవంత్ రెడ్డి ఎడాపెడా మాట్లాడేందుకు రేవంత్ ధర్నా. ధర్నాకు కాంగ్రెస్ పెద్దలు ఎందుకు రాలేదు. న్యాయబద్దంగా, చట్టబద్దంగా, నిపుణులతో మాట్లాడి బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చెయ్యాలి. రేవంత్ రెడ్డి పాలనలో వైఫల్యం, రాజకీయంలో వైఫల్యం, హామీలు అమలు చెయ్యడంలో వైఫల్యం.. అవినీతిలో మాత్రం సక్సెస్ అయ్యారు. గత ప్రభుత్వ కేసీఆర్‌తో అవినీతిలో పోటీ పడుతున్నారు. అవినీతి, అప్పుల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. మజ్లిస్ పార్టీ కనుసైగలో ముస్లింలకు కేసీఆర్ రిజర్వేషన్లు ఇచ్చాడు. ఇపుడు రేవంత్, కాంగ్రెస్ కూడా 34 నుంచి 32కు కుదించే ప్రయత్నం చేస్తున్నారు. బీసీ జనాభా ప్రాతిపదికన 42 శాతం ఇవ్వడం లేదు. కులగణనలో తప్పులు చేశారు’ అని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

## కబ్జాలను అరికట్టి చరిత్రను కాపాడతాం..



హైదరాబాద్ : గండిపేట మండలంలోని పుప్పాలగూడ గ్రామంలో 200 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అరికట్టి చరిత్రను కాపాడతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. దేవాలయాలకు, దర్గాకు 10 ఎకరాల వరకు ఇక్కడ భూమి ఇచ్చినట్టు చెబుతున్నందున రెవెన్యూ అధికారులతో కలిసి త్వరలో పరిశీలించి హద్దులు నిర్ధారించి కంచె ఏర్పాటు చేస్తామని తెలిపారు. పుప్పాలగూడలోని 452/1, 454/1 సర్వే నంబర్లలో ఉన్న కొండలను పరిరక్షించాలని కోరుతూ సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన వివిధ మతాలకు కేటాయించిన భూముల వివరాలను తెలుసుకున్నారు. సహజ సిద్ధంగా ఉన్న గుట్టలను, 250 ఏళ్ల చరిత్ర కలిగిన కొండలను కాపాడితే ప్రకృతిని పరిరక్షించినట్లవుతుందన్నారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దనే హైకోర్టు ఉత్తర్వులను పరిశీలిస్తామన్నారు. అనంతరం నార్సింగ్ ప్రాంతంలో 160 ఎకరాల మేర ఉన్న చారిత్రక రాళ్ల గుట్టలను హైడ్రా కమిషనర్ పరిశీలించారు.

నిథిమ్ చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్

నిథిమ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్) ఆవరణలో ఉన్న చెరువును కూడా రంగనాథ్ బుధవారం పరిశీలించారు. ఒకప్పుడు చెరువులో బోటు షికారు సాగేది. ప్రస్తుతం చెరువు మురికి కూపంగా మారిపోవడంతో గత వైభవాన్ని తీసుకువచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నిథిమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణతో రంగనాథ్ చర్చించారు. పూడికతీతతో పాటు చుట్టూ బండ్ నిర్మాంచాలన్నారు.

## సంపాదకీయం

శుక్రవారం 08-08-2025

# ఇక సరళమైన పన్ను విధానం

పొదుపును ప్రోత్సహించడం, ఎగుమతులను పెంచడం, సమతుల అభివృద్ధికి పాటుపడటమే మన పన్నుల వ్యవస్థకు మూలసూత్రాలయ్యాయి. సబ్సిడీలు, పన్ను తగ్గింపులు, మినహాయింపులు.. ఏవైనా సామాజిక న్యాయ సాధనకు ఉపకరించాలి. కానీ, ఇటీవలి దశాబ్దాలలో పన్ను మినహాయింపులు అధికమై ఆదాయం కోసుకుపోతోంది. మరోవైపు నిర్వహణ ఖర్చులు, చట్టపరమైన సమస్యలు పెరిగి పోయాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కొత్త ఐటీ బిల్లును సిద్ధం చేసింది.సూర్యుడు భూమి నుంచి తేమను స్వీకరించి అంతకు వెయ్యిరెట్లు ఎక్కువగా వర్షాన్ని కురిపించినట్లే రాజు ప్రజల నుంచి వసూలుచేసే పన్నులను వారి శ్రేయస్సుకే ఖర్చు చేయాలని మహాకవి కాళిదాసు ప్రబోధించాడు. పన్నులూ పాలనా వ్యవస్థలూ ప్రజాహితం కోసమేనన్నాడు. చాణక్యుడు అర్థశాస్త్రంలో అతిగా పన్నులు విధించకూడదనీ, న్యాయమైన సుస్థిరమైన పన్నుల విధానం ప్రజలందరూ చక్కగా పన్నులు చెల్లించేలా ప్రోత్సహిస్తుందనీ పేర్కొన్నాడు. ఆర్థికపరంగా సమాఖ్యవాదాన్ని పాటించాలనీ, మూలధన నిర్మాణం జరిగేలా సబ్సిడీలను ఉపయోగించాలని నిర్దేశించాడు. కాళిదాసు, కౌటిల్యుల ప్రతిపాదనలు నేటి ఆర్థికానికీ చక్కగా వర్తిస్తాయి.భారతీయ పన్నుల వ్యవస్థకు ఇంతకాలం 1961నాటి ఆదాయపన్ను చట్టమే పునాదిగా ఉంటోంది. అయితే దీనికి పదేపదే సవరణలు చేయడం, కాలంచెల్లిన పరిభాషను వాడటం, చట్ట నిర్మాణం సంక్లిష్టంగా ఉండటం వల్ల ఆదాయపన్ను చట్టానికి వక్రభాష్యం చెప్పడం సులభమైందనే విమర్శలున్నాయి. తమను వేధించడం కోసం చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, చిన్న వ్యాపారులు, స్టార్టప్‌ల నిర్వాహకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని చక్కదిద్దడానికి కేంద్రం పూనుకొంది. 1961నాటి చట్టం స్థానంలో కొత్త శాసనాన్ని తీసుకొస్తామనీ, అది 2026 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. భారతీయ ఆదర్శాలు, నైతిక విలువలనూ, కాళిదాసు, కౌటిల్యుల ప్రబోధాలనూ కొత్త చట్టం ప్రతిబింబిస్తుంది.

సందిగ్ధతకు తావులేకుండా...

పాత ఆదాయపన్ను చట్టం 'క్రితం సంవత్సర' ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని, 'అసెస్‌మెంట్ ఇయర్'లో ఆదాయ మదింపు చేసి పన్నులు విధిస్తోంది. ఈ రెండు పదాలు అయోమయానికి దారితీస్తున్నాయి. కొత్త ఆదాయపన్ను బిల్లు ఈ రెండు పదాలను తొలగించి 'పన్ను సంవత్సరం' అనే పదాన్ని ముందుకుతెస్తోంది. అది కూడా ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు వర్తిస్తుంది. 2025 ఆదాయపన్ను బిల్లు కొత్త పన్నులేమీ విధించదు. ప్రస్తుతం ఉన్న పన్ను శ్లాబులు, రేట్లను మార్చదు. నిర్వచనాలు, నేరాలు, జరిమానాల్లో మార్పులు తీసుకురావడం లేదు. మునుపటి చట్టం కంటే ఇది ఎంతో సరళంగా ఉంటుంది. పాత చట్టంలో 700 సెక్షన్లు ఉంటే, కొత్త బిల్లులో అవి 536 మాత్రమే ఉన్నాయి. పాత చట్టం 823 పేజీలుంటే, కొత్త బిల్లును 622 పేజీలకు కుదించారు. కొత్త బిల్లు నిబంధనల్లో వేతన జీవుల జీతభత్యాలు, మినహాయింపులను అంతర్భాగం చేశారు. గ్రాట్యుటీ, పింఛన్ కమ్యుటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, స్వచ్ఛంద పదవీ విరమణ లేదా రిట్రెంచ్‌మెంట్ సందర్భంగా వచ్చే నగదు పరిహారాలను వేతన సెక్షన్‌లోనే కలిపేశారు. డబ్బు చెల్లించేటప్పుడూ, తీసుకునేటప్పుడూ పన్ను వసూలుకు సంబంధించిన టీడీఎస్, టీసీఎస్ నిబంధనలను సరళీకరించారు. రెసిడెంట్, నాన్-రెసిడెంట్, ఎనీ పర్సన్ అని పన్ను చెల్లింపుదారులను వర్గీకరించారు. నోట్యాక్స్ డిడక్షన్ నిబంధనలను సులభంగా అర్థమయ్యేలా ఒకే రిఫరెన్స్ పట్టికలో పొందుపరిచారు.

సిబ్బందికి మరిన్ని అధికారాలు

ఆదాయపన్ను చట్టం-1961లో లాభాపేక్ష లేని సంస్థలకు సంబంధించిన నిబంధనలు క్రమపద్ధతిలో లేవు. కొత్త బిల్లులో వీటిని ఒకే అధ్యాయంలో చేర్చారు. ఆధునిక సాంకేతికతల సాయంతో పన్నుల యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి కొత్త బిల్లు చర్యలు తీసుకుంటుంది. బంగారం, ఆభరణాలు, డబ్బు, ఇతర విలువైన వస్తువులతో పాటు క్రిప్టోకరెన్సీలు, నాన్ ఫంజిబుల్ టోకెన్లను కూడా అప్రకటిత ఆదాయంలో భాగంగా పరిగణించి సోదాలు చేసే అధికారాన్ని ఆదాయపన్ను శాఖకు ఇవ్వాలని ప్రతిపాదిస్తోంది. పాత చట్టం- సరైన పత్రాలు సమర్పించని వ్యక్తుల ఇళ్లు, సంస్థల కార్యాలయాల తలుపులను బద్దలుకొట్టి సోదాచేసి కీలక పత్రాలను స్వాధీనం చేసుకునే అధికారాన్ని పన్ను సిబ్బందికి ఇస్తోంది. కొత్తబిల్లు దీనికి తోడు ఎలక్ట్రానిక్ రికార్డులు, ఈ-మెయిల్, సర్వర్లతో పాటు వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమ రికార్డులను, ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లను కూడా తనిఖీ చేసే అధికారాన్ని ఇవ్వాలని ప్రతిపాదిస్తోంది.

గోప్యతకు భంగం?

కొత్త బిల్లును ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. తరవాత దాన్ని సెలెక్ట్ కమిటీకి పంపగా, 285 మార్పులను ప్రతిపాదించింది. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, గృహ యజమానులు, వేతన జీవులు, చిన్న పరిశ్రమలు, లాభాపేక్ష లేని సంస్థల పన్ను నిబంధనలకు సంబంధించిన మార్పులవి. క్యాపిటల్ అసెట్, మౌలిక వసతుల క్యాపిటల్ కంపెనీ, సహకార బ్యాంకుల నిర్వచనాలను మరింత పదునుగా తయారుచేసింది. మున్సిపల్ పన్నులు పోనూ మిగిలిన వార్షిక అద్దె ఆదాయంలో గృహ యజమానులకు 30శాతం స్టాండర్డ్ డిడక్షన్ ఇవ్వాలని సెలెక్ట్ కమిటీ ప్రతిపాదించింది. యజమాని నివసిస్తున్న ఇంటికీ, అద్దెకు ఇచ్చిన ఇళ్లకూ నిర్మాణానికి ముందు తీసుకున్న రుణంపై వడ్డీకి కూడా డిడక్షన్ ఇవ్వాలని సిఫార్సు చేసింది. ఇంటర్ కార్పొరేట్ డివిడెండ్ డిడక్షన్‌ను అనుమతించి డబుల్ టాక్సేషన్‌కు ఆస్కారం లేకుండా చేయాలనీ సూచించింది. పన్ను వివాదాలను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని పేర్కొంది. ఇక బిల్లుపై వచ్చిన విమర్శలలో ఒకటి- పౌరుల డిజిటల్ గోప్యతకు భంగం వాటిల్లజేసేలా ఉండటం. ఈ బిల్లులోని నిబంధనలూ, వ్యక్తిగత సమాచార రక్షణ చట్టం, సైబర్ చట్టాల్లోని నిబంధనలూ ఒకేలా ఉండటం వేర్వేరు భాష్యాలకు తావు ఇవ్వవచ్చు. ఇది తలెత్తకుండా చూడాలి. బిల్లు పట్ల పన్ను చెల్లింపుదారులు, నిపుణులకు అవగాహన కల్పించాలి. కొత్త బిల్లును సమాజ హితానికీ, పన్ను చెల్లింపుదారుల సౌలభ్యానికీ, దేశార్థిక ప్రగతికీ తోడ్పడే విధంగా ముందుకు తీసుకెళ్లాలి.

# తమ్ముడు రెడ్డి వార్నింగ్ వెనుక ఆంతర్యం?




హైదరాబాద్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తమ్ముడు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రోజుకో సంచలన ప్రకటన చేస్తూ తన అసంతృప్తిని బయటపెడుతున్నారు. 'పదవుల కోసం కాళ్లు పట్టుకొనేది లేదు. పదవి ఇస్తారో ఇవ్వరో అది మీ ఇష్టం' అంటూనే అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని రాజగోపాల్ రెడ్డి ఇచ్చిన సంకేతాల వెనుక ఆంతర్యం ఏంటనే చర్చ రాజకీవర్గాల్లో సాగుతోంది. మంత్రివర్గ విస్తరణ తర్వాత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సీఎంను టార్గెట్ చేసుకుని విమర్శలు చేస్తుండటం కాంగ్రెస్ నాయకత్వంలో కలకలం రేపుతున్నది. హస్తం పార్టీ హైకమాండ్‌ను బెదిరించేందుకే ఆయన రాజీనామా వ్యాఖ్యలు చేశారా? లేక భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించి మనోగతాన్ని బయటపెట్టారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో అంతర్గతంగా 'ఆల్ నాట్ వెల్' అనే వాదనను మరోసారి చర్చల్లోకి తెచ్చాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

రేవంత్ టార్గెట్‌గా రాజగోపాల్ రెడ్డి విమర్శలు

సీఎం రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని ఈ ఏడాది జూన్ 8న విస్తరించారు. మొత్తం ఆరు బెర్తులు భర్తీ చేయాల్సి ఉండగా.. ముగ్గురితో ప్రస్తుతానికి సరిపెట్టారు. మరో మూడు మంత్రి పదవులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకట్ స్వామిని రేవంత్ రెడ్డి తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. మంత్రి పదవులు దక్కని నాయకులు అసంతృప్తికి గురయ్యారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి నాయకులను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఇతర నాయకులు బుజ్జగించారు. విస్తరణలో చోటు దక్కకపోవడంతో రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయం ఆయన మాటల్లోనే బయటపడుతున్నది. విస్తరణ జరిగిన రెండు మూడు రోజులకు సోషల్ మీడియాలో స్పందించిన రాజగోపాల్.. క్రమశిక్షణ గల కాంగ్రెస్ కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని ట్వీట్ పెట్టారు. విస్తరణకు ముందు అసెంబ్లీ లోపల, బయట కూడా బీఆర్ఎస్‌పై ఒంటికాలిపై విమర్శలు చేశారు. మంత్రి పదవి కోసం విమర్శలు చేస్తున్నారని రాజగోపాల్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎదురుదాడి చేసింది. తీరా చూస్తే క్యాబినెట్‌లో ఆయనకు స్థానం లభించలేదు. దీంతో రాజగోపాల్ రెడ్డి స్వరం పెంచారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగర్ కర్నూల్ జిల్లాలోని జటప్రోల్‌లో జూలై 18న జరిగిన సభలో వచ్చే పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్ రెడ్డి చెప్పడాన్ని తప్పుపట్టడం ద్వారా తన అసంతృప్తి ప్రకటనలను రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారనే వాదనలు ఉన్నాయి. తెలంగాణ కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించబోరని ఎక్స్‌లో హెచ్చరిక పూర్వక పోస్టు పెట్టారు. ఈ నెల 1న జర్నలిస్టుల గురించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా తప్పుబడుతూ సోషల్ మీడియాలో మరో పోస్టు పెట్టారు. అవినీతి, అక్రమాలను సోషల్ మీడియా జర్నలిస్టులు బయటపెడుతున్నారని వారికి మద్దతు పలికారు. అలాంటి జర్నలిస్టుల గురించి సీఎం వ్యాఖ్యలను తప్పుపట్టారు. మునుగోడు నియోజకవర్గానికే పరిమితమైన రాజగోపాల్‌రెడ్డి.. గాంధీ భవన్ కూడా దూరంగా ఉంటున్నారు. మంగళవారం తన నియోజకవర్గంలోని లచ్చమ్మగూడెంలో జరిగిన కార్యక్రమంలో అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సంచలన వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్‌లో కలకలం రేపాయి.

అసెంబ్లీ ఎన్నికల ముందు ఏం జరిగింది?

2023 నవంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అంతకు కొన్ని రోజుల ముందే రాజగోపాల్ రెడ్డి బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. 2022 ఆగస్టులో ఆయన బీజేపీలో చేరారు. బీజేపీలో చేరడానికి ముందే కాంగ్రెస్ పార్టీకి, మునుగోడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. మునుగోడు ఉప ఎన్నికలో పోటీ చేసి ఓడిపోయారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరే సమయంలో మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ నాయకత్వం హామీ ఇచ్చిందనేది రాజగోపాల్ రెడ్డి వాదన. అసెంబ్లీ ఎన్నికల తర్వాత 2024 మే లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సమయంలో భువనగిరి ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపిస్తే మంత్రి పదవిని ఇస్తామని కూడా పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని రాజగోపాల్ రెడ్డి చెబుతున్నారు. చామల గెలిచారు కానీ.. రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు దక్కలేదు. ఇప్పటికే రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో రాజగోపాల్ రెడ్డి సోదరుడు వెంకట్ రెడ్డి రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్నారు. రాజగోపాల్ రెడ్డికి కూడా మంత్రి పదవి ఇస్తే ఒకే ఇంట్లో రెండు పదవులు ఇచ్చినట్టు అవుతుంది. ఇదే ఢిల్లీ పెద్దల్లో చర్చల్లో ఉన్నట్టు తెలుస్తున్నది. మరో వైపు రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తే కోదాడ ఎమ్మెల్యే పద్మావతి కూడా మంత్రి పదవి అడుగుతున్నారనే చర్చ తెరమీదికి వచ్చింది. ఇప్పటికే పద్మావతి భర్త ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నారు. నాలుగైదు నెలల క్రితం నల్లగొండలో జరిగిన సమీక్షలో ఉత్తమ్ కుమార్ రెడ్డిని సీఎం అంటూ రాజగోపాల్ రెడ్డి సంబోధించారు. ఈసారి కాకపోయినా భవిష్యత్తులో ఆయన సీఎం అవుతారని రాజగోపాల్ రెడ్డి కామెంట్ చేశారు. తనకు మంత్రి పదవి విషయంలో అడ్డు చెప్పకుండా ఉండేందుకు రాజగోపాల్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారనే చర్చ అప్పట్లో జరిగింది. బీజేపీ నుంచి చివరి నిమిషంలో కాంగ్రెస్‌లో చేరిన వివేక్ వెంకటస్వామికి రేవంత్ క్యాబినెట్ చోటు దక్కింది. కానీ, తనకు మంత్రి పదవి దక్కలేదని రాజగోపాల్ రెడ్డి తన మాటల ద్వారా బయటపెట్టారు. సామాజిక సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉన్నందున రాజగోపాల్ రెడ్డికి చోటు ఇవ్వలేదని హస్తం నాయకులు చెబుతున్నారు. ఈ వాదనతో రాజగోపాల్ రెడ్డి ఏకీభవించడం లేదు. ఎల్బీ నగర్ నుంచి పోటీ చేస్తే తనకు మంత్రి పదవి దక్కేదని ఆయన అన్నారు.

కోమటిరెడ్డి సోదరుల మధ్య గ్యాప్?

గత కొన్ని రోజులుగా కోమటిరెడ్డి సోదరుల మధ్య గ్యాప్ ఉందనే ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరాలనే రాజగోపాల్ రెడ్డి నిర్ణయాన్ని అప్పట్లో వెంకట్ రెడ్డి వ్యతిరేకించారనే అభిప్రాయాలు ఉన్నాయి. కానీ, రాజగోపాల్ రెడ్డి పార్టీ మారారు. మునుగోడు ఉప ఎన్నికలో రాజగోపాల్ రెడ్డికి ఓట్లు వేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు వెంకట్ రెడ్డి ఫోన్ చేసినట్టుగా ప్రచారం జరిగిన ఆడియో అప్పట్లో లీకైంది. దీనిపై కాంగ్రెస్ నాయకత్వం విచారించింది. రాజగోపాల్ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత పరిణామాలు ఈ ఇద్దరి మధ్య గ్యాప్‌ను పెంచాయనే ప్రచారం సాగుతోంది. మంత్రి పదవిని తనకు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వాన్ని పట్టుబట్టే విషయంలో అన్న పట్టించుకోవడం లేదనేది తమ్ముడి భావనగా ఆయన వర్గాలు చెబుతున్నాయి. గతంలో పార్టీ కార్యక్రమాలకు ఇద్దరు కలిసి వెళ్లేవారు. ఇటీవల కాలంలో అలాంటి సందర్భాలు కనిపించడం లేదని పార్టీ కార్యకర్తలు గుర్తు చేస్తున్నారు. రేవంత్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో రాజగోపాల్ రెడ్డి పోస్టులు పెడుతుంటే.. వెంకట్ రెడ్డి మాత్రం సీఎంతో అత్యంత సన్నిహితంగా ఉంటున్నారు. సలార్ సినిమాలో ఓ పాట బ్యాక్ గ్రౌండ్‌లో వినిపించేలా వెంకట్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఫోటోతో ఎక్స్ లో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పోస్టు పెట్టారు. రేవంత్ రెడ్డి మరో పదేళ్లు సీఎంగా ఉంటారని గత ఏడాది రెండు సందర్భాల్లో వెంకట్ రెడ్డి ప్రకటించారు. నల్లగొండలో క్యాంప్ కార్యాలయం ప్రారంభించిన తర్వాత మళ్లీ సీఎం రేవంత్ కావాలని గణపతి పూజ చేయించినట్టు వెంకట్ రెడ్డి ఫోన్‌లో సీఎంకు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. రాజగోపాల్ రెడ్డి మాత్రం రాలేదు. తమ్ముడికి మంత్రి పదవి విషయంలో మంగళవారం ఢిల్లీలో వెంకట్ రెడ్డి స్పందించారు. రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి విషయంలో అధిష్ఠానం మాటిచ్చిన విషయం తనకు తెలియదన్నారు. తన సోదరుడికి మంత్రి పదవి ఇచ్చే స్థాయిలో తాను లేనని తేల్చి చెప్పారు. సీఎం, హైకమాండే ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటుందని ఆయన అన్నారు.

# 'జల విలయం'.. ఉత్తరాఖండ్ కు ఎందుకీ దుస్థితి..?



మేఘాల ఉరుములు: ఉత్తరాఖండ్ పర్వత ప్రాంతం కావడంతో, రుతుపవన గాలులు హిమాలయ పర్వత శ్రేణులకు అడ్డుగా ఉంటాయి. దీంతో తేమతో నిండిన మేఘాలు ఒకేచోట పేరుకుని, చల్లని వాతావరణం కారణంగా ఒక్కసారిగా భారీ వర్షం కురుస్తుంది. దీనినే క్లౌడ్ బరస్ట్ అంటారు. ఈ కారణంగా ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటివి జరుగుతున్నాయి.ఆకస్మిక వరదలు : క్లౌడ్ బరస్ట్ వల్ల నదులలో నీటిమట్టం అకస్మాత్తుగా పెరిగి, ఆకస్మిక వరదలు వస్తాయి. ఈ వరదలు బురద, రాళ్లు, చెట్లను వెంటబెట్టుకొని వచ్చి భారీ నష్టాన్ని కలిగిస్తాయి.

భౌగోళిక అస్థిరత

బలహీనమైన హిమాలయ పర్వత శ్రేణులు: ఉత్తరాఖండ్ అనేది హిమాలయ పర్వత శ్రేణులలో ఉంది. ఈ పర్వతాలు భూకంపాలు, కొండచరియలు విరిగిపడటానికి చాలా అవకాశం ఉన్న ప్రాంతం.జోషిమఠ్ తరహా పరిస్థితి: బాగేశ్వర్ జిల్లాలో విచ్చలవిడిగా జరుగుతున్న మైనింగ్ (గనుల తవ్వకం వల్ల నేల కుంగిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది గతంలో జోషిమఠ్‌లో జరిగిన ఘటనను పోలి ఉందని వారు పేర్కొన్నారు. సరిహద్దుల్లో తవ్వకాలు, ఇళ్లకు సమీపంలో మైనింగ్, వ్యర్థాలను నదుల్లో పారవేయడం వంటి అశాస్త్రీయ పద్ధతులు ఈ పరిస్థితికి కారణమవుతున్నాయి.

మానవ తప్పిదాలు, అభివృద్ధి పనులు:

అశాస్త్రీయ మైనింగ్ : నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న మైనింగ్ కార్యకలాపాలు ఈ ప్రాంతాన్ని మరింత అస్థిరంగా మారుస్తున్నాయి. ఇది కొండచరియలు విరిగిపడటానికి, నేల కుంగిపోవడానికి దారితీస్తుంది.నీటి ప్రవాహాల దిశ మార్పు: మైనింగ్, నిర్మాణ పనుల వల్ల సహజ నీటి ప్రవాహాల మార్గాలు దెబ్బతింటున్నాయి. దీనివల్ల కొండల అడుగు భాగంలో నీరు చేరి, కొండల బలాన్ని తగ్గిస్తుంది.అభివృద్ధి పనులు : పర్యాటక రంగం కోసం చేపడుతున్న రోడ్ల విస్తరణ, ఇతర నిర్మాణాల వల్ల పర్యావరణ వ్యవస్థ కు తీవ్ర నష్టం కలుగుతోంది.

వాతావరణ మార్పులు

గ్లేసియర్ల కరుగుదల: గ్లోబల్ వార్మింగ్ వల్ల హిమాలయాల్లో గ్లేసియర్లు వేగంగా కరిగిపోతున్నాయి. దీనివల్ల నదుల్లో నీటి ప్రవాహం పెరిగి, ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం పెరుగుతోంది.గ్లేసియర్ల కరుగుదల అనేది ఒక తీవ్రమైన పర్యావరణ సమస్య. దీనికి ప్రధాన కారణం గ్లోబల్ వార్మింగ్. శిలాజ ఇంధనాలను విపరీతంగా వాడటం వల్ల వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ వంటి గ్రీన్ హౌస్ వాయువుల సాంద్రత పెరుగుతుంది. ఇవి సూర్యరశ్మిని గ్రహించి భూమి వేడెక్కడానికి కారణమవుతాయి.అసాధారణ వర్షపాతం : వాతావరణ మార్పుల వల్ల వర్షపాతం సరళిలో మార్పులు వస్తున్నాయి. ఒకేసారి అతి భారీ వర్షాలు కురవడమే క్లౌడ్ బరస్ట్ సంఖ్య పెరగడానికి ఒక కారణం.ఈ అన్ని కారణాల కలయిక వల్ల ఉత్తరాఖండ్ తరచూ ప్రకృతి విపత్తులకు గురవుతోంది. అక్కడి సున్నితమైన పర్యావరణ వ్యవస్థ, భౌగోళిక పరిస్థితులను పట్టించుకోకుండా చేసే అభివృద్ధి పనులు ఈ విపత్తుల తీవ్రతను మరింత పెంచుతున్నాయి.

ధరాలీలో జరిగింది క్లౌడ్ బరస్టేనా..?

మంగళవారం (ఆగస్టు 5) ధరాలీ గ్రామాన్ని ధ్వంసం చేసిన ఆకస్మిక వరదకు గ్లేషియర్ (హిమానీనదం) కూలిపోవడం లేదా గ్లేషియర్ సరస్సు ఉప్పొంగడం కారణం అయ్యే అవకాశం ఉందని.. వాతావరణ, ఉపగ్రహ డేటాను విశ్లేషిస్తున్న నిపుణులు ప్రాథమికంగా అంచనావేస్తున్నారు. అందుకే అంత భారీ పరిమాణంలో నీటి ప్రవాహంతో బురద ధరాలీని ముంచెత్తి ఉండవచ్చని చెబుతున్నారు. మంగళవారం హర్సిల్ ప్రాంతంలో 24 గంటల్లో 9%ఎఎ% వర్షం మాత్రమే కురిసింది. భట్వానిలో 11mm మాత్రమే పడింది. అయితే క్లౌడ్ బరస్ట్ సంభవిస్తే ఇంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. దీంతో గ్లేషియర్ కూలిపోవడం, గ్లేషియర్ లేక్ ఉప్పొంగడం వల్లనే ప్రమాదం సంభవించి ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

2013లో క్లౌడ్ బరస్ట్ వల్లే కేదార్‌నాథ్ విపత్తు కూడా..

క్లౌడ్ బరస్ట్ ఎలాంటి విలయం సృష్టిస్తుందో చెప్పడానికి 2013లో జరిగిన కేదారనాథ్ విపత్తు ఓ ఉదాహరణ. ఇది ఉత్తరాఖండ్ లో సంభవించిన అతి పెద్ద విపత్తుల్లో ఒకటి. దీనివల్లే ఉత్తర భారతదేశంలో వాతావరణం తీవ్ర మార్పులకు గురవుతుంది. ఇలా రుతుపవనాలు, వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ కలయిక వల్ల అసాధారణమైన వాతావరణ పరిస్థితి 2013లో కేదరానాథ్ లో ఏర్పడింది. ఈ రెండింటి కలయిక వల్ల హిమాలయ పర్వత శ్రేణుల్లో అత్యధిక తేమతో కూడిన మేఘాలు ఏర్పడి క్లౌడ్ బరస్ట్ జరిగింది. దీని వల్ల అతి భారీ వర్షం కురిసింది. ఆకస్మిక వరదలు వచ్చి తీవ్ర నష్టం జరిగింది.

ఎక్కడుందీ ఈ ప్రాంతం..?

ఎత్తైన పర్వత సానువుల్లో ఉన్న ధరాలీ.. ఉత్తరాఖండ్ లోని సుందర మైన ప్రాంతాల్లో ఒకటి.. గంగోత్రి యాత్రకు వెళ్లే ప్రయాణికులకు విడిది.. ఆ ప్రాంతం ఇప్పుడు ఒక్క వరదతో తుడిచిపెట్టుకుపోయి తీవ్ర విషాదాన్ని నింపింది.

# అందాల పోటీలు పెట్టడం కాదు

హైదరాబాద్,అందాల పోటీలు పెట్టామని గొప్పలు చెప్పుకోవడం కాదు.. ముందు స్త్రీలు, మహిళా ప్రతినిధులను గౌరవించడం నేర్చుకోండి అని కాంగ్రెస్ నేతలను మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బాలాపూర్‌లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశపూర్వకంగా అవమానించడం విచారకరం అని ఆయన పేర్కొన్నారు. తన నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో కార్యక్రమంలో పాల్గొన్న సబితా ఇంద్రా రెడ్డి.. ప్రోటోకాల్ పాటించకుండా ఓడిపోయిన కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని వేదిక మీద కూర్చోబెట్టి, తనకు చోటు లేకపోవడంతో అధికారిక కార్యక్రమంలో ఇదెక్కడి అన్యాయం అని ప్రశ్నించినందుకు గాను స్థానిక ఎమ్మెల్యే, అందులోనూ మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా కాంగ్రెస్ కార్యకర్తలు సబితా ఇంద్రారెడ్డి మీదకు దూసుకురావడం కాంగ్రెస్ పార్టీలో మహిళలకు దక్కుతున్న గౌరవానికి నిదర్శనం అని మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ఒక ఆడబిడ్డకు ఇంత అవమానం జరుగుతుంటే చూసి చూడనట్టు వ్యవహరించిన బాధ్యతరహిత మంత్రి శ్రీధర్ బాబు అని ఆనంద్ ధ్వజమెత్తారు. మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే అని చూడకుండా గతంలో కూడా నిండు సభలో కించపరిచారు. రాజ్యాంగపరమైన నియమాలకు అనుగుణంగా, సబితా ఇంద్రారెడ్డికి పూర్తి భద్రత కల్పించాల్సిన పోలీసులు కాంగ్రెస్ నాయకులకు భయపడి రక్షణ కల్పించలేకపోయారు. ప్రభుత్వం తరపున జరిగే రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సైతం గాంధీ భవన్‌లో జరిగే రాజకీయ కార్యక్రమంలాగా కాంగ్రెస్ పార్టీ మార్చేసిందని ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం నాడు మాట్లాడుతూ.. అవకాశం వస్తే ఆడవారు ఏ రంగంలోనైనా రాణిస్తారని, రాజకీయాల్లోకి మహిళలు కూడా రావాలని పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇచ్చిన రేవంత్ రెడ్డి ముందు మీరు మహిళలను గౌరవించండి. రాష్ట్రంలో అసెంబ్లీ సాక్షిగా, టీవీ చర్చా కార్యక్రమాల్లో, మీడియా సమావేశాల్లో మహిళల హుందాతనానికి భంగం కలిగించేలా మీరు వ్యాఖ్యానిస్తుంటే, మీ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు మిమ్మల్ని అనుసరిస్తూ.. మహిళలను ప్రత్యక్షంగా వేదికలపైన సైతం కించపరుస్తూ శునకానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# పెళ్లైన ఐదునెలలకే నవ వధువు ఆత్మహత్య

న్యూఢిల్లీ,కోటి ఆశలతో అత్తింట్లో అడుగుపెట్టిన ఓ మహిళ.. పెళ్లైన ఐదు నెలలకే తనువు చాలించింది. భర్త వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడింది. అయితే, భర్త మాత్రం తన భార్య ఆత్మహత్య చేసుకుందని చెప్తుండగా.. యువతి కుటుంబం మాత్రం కట్నం కోసం తమ బిడ్డను హింసించి హత్య చేశారని ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్నోకు చెందిన అనురాగ్ సింగ్ హాంకాంగ్‌కు చెందిన షిప్ మేనేజ్‌మెంట్ సంస్థలో సెకండ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మధు (32) అనే మహిళతో ఈ ఏడాది ఫిబ్రవరి 25న వివాహం జరిగింది. అయితే, వివాహం సమయంలో రూ.15 లక్షలు కట్నం డిమాండ్ చేసినట్లు యువతి తల్లిదండ్రులు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా యువతి ఫ్యామిలీ చూపించింది. పెళ్లి సమయంలో రూ.5 లక్షలు ఇవ్వగలిగినట్లు చెప్పారు. అయితే, పెళ్లైన తర్వాత అనురాగ్ తనకు కట్నం కోసం పదేపదే ఫోన్ చేసి ఒత్తిడి చేశాడని మధు తండ్రి ఫతే బహదూర్ సింగ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లైన నెలలోపే తొలిసారి తన కూతురు మధుపై అల్లుడు అనురాగ్ దాడి చేశాడని, దీంతో ఆమె పుట్టింటికి తిరిగి వచ్చినట్లు చెప్పారు. అడిగిన కట్నం చెల్లించామని.. దీంతో బిడ్డను తిరిగి తీసుకెళ్లినట్లు వివరించారు. అయితే, తన కూతురిని హింసించడం మాత్రం ఆపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు అనురాగ్ వేరే అమ్మాయితో వివాహేతర సంబంధంలో ఉన్నాడని ఆరోపించారు. ఇటీవలే ఓ హోటల్‌లో తన మాజీ ప్రియురాలితో ఓ రాత్రి గడిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జులై 31న హోటల్ బుకింగ్‌కు సంబంధించిన వివరాలను కూడా ఫిర్యాదులో పంచుకున్నారు. ఆగస్టు 3 ఆదివారం నాడు అనురాగ్ తనపై దాడి చేసినట్లు మధు తన అక్క ప్రియతో చెప్పినట్లు యువతి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కూతురు గర్భవతి అని, తనను కడుపు తీయించుకోమని ఒత్తిడి చేసినట్లు చెప్పారు. 'ఆగస్టు 4న సాయంత్రం 4:32 గంటలకు అతను ఫోన్ చేసి నా కూతురు ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని చెప్పాడు. అతడే నా కూతురిని చంపాడని నేను అనుకుంటున్నాను' అని మధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు మధు అక్క ప్రియ మాట్లాడుతూ.. 'నా చెల్లి చాలా లైవ్‌లీ పర్సన్. కానీ అనురాగ్ మాత్రం ఆమె ఎవరితోనూ మాట్లాడటం ఇష్టపడేవాడు కాదు. స్నేహితులతో కూడా మాట్లాడనిచ్చే వాడు కాదు. ఆఖరికి మాతో కూడా మాట్లాడొద్దని చెప్పేవాడు. అతను ఊర్లో లేనప్పుడు మాత్రమే మేము మాట్లాడుకునే వాళ్లం. ఆమె ఫోన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసేవాడు. ఎటువంటి కారణం లేకుండానే మా చెల్లిని కొట్టేవాడు. తనతో కలిసి డ్రింక్ చేయమని ఒత్తిడి తెచ్చేవాడు. చివరి సారిగా తనతో మాట్లాడినప్పుడు.. అనురాగ్ కొట్టినట్లు చెప్పింది. అప్పుడు తనని ఇంటికి తీసుకురావాలని అనుకున్నాను. కానీ మళ్లీ గొడవ జరుగుతుందనే భయంతో ఆగిపోయాను' అంటూ చెప్పుకొచ్చింది.

# ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తుతున్న వరదలు

ఢిల్లీ,హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను ఆకస్మిక వరదలు చుట్టుముడుతున్నాయి. ఉత్తరకాశీ జిల్లాలో జలవిలయం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా హిమాచల్ ప్రదేశ్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. హిమాచల్ రాష్ట్ర వ్యాప్తంగా గతకొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. టాంగ్లింగ్ ప్రాంతంలో కురిసిన వర్షం కారణంగా కిన్నెర్ కైలాష్ యాత్ర మార్గంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదల్లో వందలాది మంది యాత్రికులు పర్వత మార్గంలో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టారు. రోప్‌వే సాయంతో దాదాపు 413 మంది యాత్రికులను రక్షించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. కాగా, రెండు రోజుల నుంచి హిమాచల్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు చాలాచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ కారణంగా దాదాపు 450 రోడ్లను అధికారులు మూసివేశారు. ముఖ్యంగా మండి జిల్లా అత్యంత ప్రభావితమైంది. ఇక్కడ దాదాపు 295 రోడ్లు మూసుకుపోయాయి. ఇక సిమ్లాలోని చక్కీమోర్ వద్ద కొండచరియలు విరిగిపడటంతో కీలకమైన చండీగఢ్-సిమ్లా జాతీయ రహదారిని అధికారులు మూసివేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉనా, కాంగ్రా, మండి, సిర్మౌర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆ నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# అమ్మతనాన్ని అమ్ముకున్న నమ్రత




హైదరాబాద్,అమ్మతనాన్ని కూడా అమ్ముకోవడమెలాగో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చూపించారు. ఇందులో బయటపడ్డ నిజాలు ఇప్పుడు విపరీత ధోరణలును బయటపెట్టాయి. ఇలాంటి సెంటర్లు ఎన్ని ఉన్నాయో వాటి కార్యకలాపాలపైనా దృష్టి సారించాలి. సరోగసీ పేరుతో ఇతరల పిల్లలను అప్పగించి లక్షల్లో దండుకోవడమనే వ్యాపారంలో నమ్రత బాగా ఆర్జించారు. కొన్నేళ్ల క్రితమే మోసాలు బయటపడి నమ్రత లైసెన్స్ రద్దు కావడంతో ఆమె ఇతర వైద్యులను బినామీగా పెట్టుకుని వారి పేరిట లైసెన్స్ తీసుకుని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, కర్ణాటక, ఒడిసా, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో సృష్టి ఫర్టిలిటీ- సెంటర్ శాఖలు నిర్వహిస్తున్నట్లు- పోలీసులు గుర్తించారు. ఎంతోమంది దంపతులను సరగసీకి ఒప్పించిన డాక్టర్ నమ్రత.. ఒక్కో జంట నుంచి రూ.30 నుంచి రూ.50 లక్షల వరకు దోచుకున్నట్లు- పోలీసులు గుర్తించారని తెలిసింది. అనేక కోణాల్లో విచారించిన పోలీసులు ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు- పోలీసులు తెలిపారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

నమ్రత ముఠాలో కీలక పాత్ర పోషించి కల్యాణి, సంతోషిలను పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే 15 మందిని అరెస్టు చేయగా.. మరికొందర్ని అరెస్టు చేయవచ్చని సమాచారం.ఈ క్రమంలో పోలీసుల విచారణలో సికింద్రాబాద్ సృష్టి ఫర్టిలిటీ- సెంటర్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో ప్రధాన నిందితురాలు, ఆ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆమెను ఐదు రోజులు కస్టడీకి తీసుకుని విచారించిన గోపాలపురం పోలీసులు... సృష్టిలో మోసాలపై కీలక విషయాలు రాబట్టినట్లు- తెలిసింది. మంగళవారం పోలీసు కస్టడీ ముగియడంతో ఆమెను మేజిస్ట్రేట్ ఎదుట హాజరపరిచి, తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు, సోమవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న బినామీ డాక్టర్ విద్యుల్లతను పోలీసులు విచారించి సృష్టిలో మోసాలపై కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఇటీవల నమ్రత రాజస్థాన్‌కు చెందిన గోపాల్ సింగ్ దంపతులను సరగసీ పేరిట నమ్మించి.. మోసగించిన విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఒడిసా దంపతులకు పుట్టిన బిడ్డను రూ.90 వేలకు కొన్న నమ్రత.. ఆ బిడ్డను రాజస్థాన్ దంపతులకు రూ.35 లక్షలకు విక్రయించింది. సరగసీ పేరుతో శిశు విక్రయాలకు పాల్పడుతున్న నమ్రతకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలతో సంబంధాలు ఉన్నట్లు- పోలీసుల దర్యాప్తులో వెల్లడైందని తెలిసింది. ఆ ముఠాలకు బట్టి రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు చెల్లించి చిన్నారులను కొంటు-న్నట్లు- గుర్తించారు. ఆ పిల్లల్నే సరగసీ ద్వారా పుట్టినట్లు నమ్మించి పిల్లలు లేని దంపతుల నుంచి రూ.30 నుంచి 50 లక్షలు తీసుకుంటున్నట్లు తేలింది. ఈ దందాలో హర్ష, పవన్, నందిని అనే వ్యక్తులు కీలకంగా వ్యవహరించినట్లు- పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఈ ఒక్క కేసు ఆధారంగా మిగతా ఫర్టిలిటీ సెంటర్ల తీరును పరిశీలించాలి. వాటి కార్యకలాపాలపై దృష్టి సారించాలి.

# కూల్చుతామన్న ఫాంహౌజ్ నుంచే బీఆర్ఎస్ ను చీల్చుతున్న బీజేపీ



హైదరాబాద్,మానసిక ప్రశాంతత, రాజకీయ రణగొణ ధ్వనులకు దూరంగా అధినేత కేసీఆర్ అత్యధిక సమయం గడిపే ఫాంహౌజ్ కారణంగా బీఆర్ఎస్ ను ప్రత్యర్థి పార్టీలు తరచూ విమర్శిస్తుంటాయి. ఫాంహౌజ్ పార్టీ అని కూడా ఎద్దేవా చేస్తుంటాయి. సరిగ్గా మూడేళ్ల కిందట మరో ఫాంహౌజ్ తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపింది. అదే హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ ఫాంహౌజ్. బీఆర్ఎస్ కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలకు రూ.వందకోట్లు, కాంట్రాక్టులు ఎరవేసి వారిని బీజేపీలోకి చేర్చుకునేందుకు ప్రయత్నం జరిగిందని బీఆర్ఎస్ ఆరోపించింది. దీనిపై అధినేత కేసీఆర్ కు ముందే ఉప్పందడంతో మొయినాబాద్ ఫాంహౌస్ కుట్రను భగ్నం చేశామని చెప్పుకొచ్చింది. ఇది జరిగింది 2022 నవంబరులో వచ్చిన మునుగోడు ఉప ఎన్నికకు ముందు.

ఆ ఎమ్మెల్యేలను వెంటేసుకుని..

ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారాన్ని బీఆర్ఎస్ మునుగోడు ఉప ఎన్నికల్లో బలంగా ఉపయోగించుకుంది. బీజేపీ వల విసిరిన ఎమ్మెల్యేలు (గువ్వల బాలరాజు- అచ్చంపేట, పైలట్ రోహిత్ రెడ్డి-తాండూరు, బీరం హర్షవర్ధన్ రెడ్డి-కొల్లాపూర్, రేగా కాంతారావు-పినపాక) ను కేసీఆర్ తన వెంట ప్రచారంలో తిప్పారు. మీడియా సమావేశంలోనూ వారిని చూపించారు. రూ.వంద కోట్లకూ తలగ్గొని తమ ఎమ్మెల్యేలు అంటూ గొప్పగా చెప్పారు. ఇదంతా ఫలించి మునుగోడు ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పది వేల ఓట్లతో గెలుపొందింది.

నాడు బీజేపీకి దెబ్బ

మునుగోడు ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ కు రాజీనామా చేసి 2022లో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు. బలమైన నాయకుడు అయిన ఆయనను ఓడించడం కష్టమే అనే అభిప్రాయం ఏర్పడింది. మునుగోడులో బీజేపీ జెండా ఎగరడం ఖాయం అని అందరూ భావించారు. కానీ, చివర్లో ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ ప్రయత్నం చేసిందంటూ కేసీఆర్ బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీసి విజయం సొంతం చేసుకున్నారు.

ఇప్పుడు అక్కడి నుంచే మొదలు..

తెలంగాణలో అధికారం అనే కలను సాకారం చేసుకునే దిశలో... మునుగోడు ఉప ఎన్నికలో గెలుపు అత్యంత అవసరం అని బీజేపీ భావించింది. కానీ, ఆ ఓటమితో అంతా మారిపోయింది. సరిగ్గా ఏడాది తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వెనుకబడిపోయింది. మునుగోడులో ఓటమి, అసెంబ్లీ ఎన్నికల్లో వెనుకబాటుకు పరోక్ష కారణం.. మొయినాబాద్ ఫాంహౌజ్ అంశమేనని కమలనాథుల భావన. అందుకనే అక్కడినుంచే నరుక్కొచ్చే పని చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును ఆపరేషన్ ఆకర్ష్ లో తమవైపు తిప్పుకొంది. మొయినాబాద్ ఫాంహౌజ్ ఘటనలో ఉన్న మరో ఎమ్మెల్యే కూడా తర్వలో బీజేపీలో చేరతారని చెబుతున్నారు. అంటే.. ఎక్కడైతే పోగొట్టుకున్నామో అక్కడే మళ్లీ వెదుక్కోవడం అన్నమాట. నాడు కేసీఆర్ ఈ అంశాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లి.. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని పడగొడతామని ప్రకటనలు చేశారు.

నాడు నేడు బీఎల్ సంతోష్...

బీఎల్ సంతోష్.. కర్ణాటకకు చెందిన బీజేపీ అగ్రనేత. జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత). బీజేపీలో మోస్ట్ పవర్ ఫుల్. అలాంటి బీఎల్ సంతోష్‌ను ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఆర్ఎస్ ప్రధాన పాత్రధారిగా పేర్కొంది. ఆయన అరెస్టుకు సైతం ప్రయత్నాలు సాగించింది. ఇప్పుడు అదే బీఎల్ సంతోష్.. నాటి మొయినాబాద్ ఫాంహౌజ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. గువ్వలతో పాటు మరో మాజీ ఎమ్మెల్యే ఆయనను కలుసుకోవడమే దీనికి నిదర్శనం.

# కులగణనతో దేశానికి తెలంగాణ రోల్ మాడల్

న్యూఢిల్లీ,తెలంగాణలో కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులు ఆమోదించామని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. కులగణన చేసి దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి పంపిన బీసీ కోటా బిల్లులను ప్రధాని మోడీ నాలుగు నెలలుగా తొక్కిపెట్టారని విమర్శించారు. బీసీ కోటా బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే రాహుల్ గాంధీకి క్రెడిట్ వస్తుందని ప్రధాని మోడీ భయమని ఎద్దేవా చేశారు.ఢిల్లీలో టీ-పీసీసీ చేపట్టిన బీసీ మహాధర్నా చూసైనా కేంద్రంలోని మోడీ సర్కార్ కు కనువిప్పు కలగాలని..మోడీ తల్చుకుంటే సాయంత్రానికే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ-పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కోటా బిల్లు తేవటం చారిత్రాత్మకమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్న మొనగాడు సీఎం రేవంత్ రెడ్డి అని.. ఆయన చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. బీసీ కోటా బిల్లుతో మోడీ పరేషాన్లో ఉన్నారని అన్నారు. ఇన్నాళ్లు బీసీలకు రిజర్వేషన్లు అడిగితే ఏ లెక్కన అడుగుతున్నారని అన్నారు. ఇప్పుడు కుల గణన చేసి ఆ లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని అడుగుతున్నామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో కులగణన చేసి అసెంబ్లీలో ఆమోదించామని.. ఇప్పుడు దేశంలోని బీసీలంతా తెలంగాణ వైపు.. రేవంత్ వైపు చూస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ ఎక్కడ మాట్లాడినా.. తెలంగాణ వైపు చూడండి.. రేవంత్ వైపు చూడండి అని చెప్తున్నారని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ కోటా బిల్లులను నాలుగు మాసాలుగా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టిందని ఫైర్ అయ్యారు. మోడీకి



బీసీల బాధ తెలియాలనే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని తెలిపారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎప్పుడైనా పనిచేసి గెలిచారా..? ఎప్పుడూ రాముడు, హనుమంతుడు పేరు చెప్పి గెలవాలని చూస్తారని విమర్శించారు. మేము కూడా దేవుళ్లను పూజిస్తాం కానీ దేవుని పేరుతో రాజకీయం చేయం ఓట్లు- అడగమన్నారు. బీజేపీ ముస్లింల పేరు చెప్పి బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూస్తోంది. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేకనే ఇలాంటి సొల్లు కబుర్లు చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ బీసీ అని ఓట్లేయించుకున్న బండి సంజయ్.. కిషన్ రెడ్డి మాట వింటు-న్నాడని విమర్శించారు. బీసీలకు మద్దతుగా రెడ్డిలు, బ్రాహ్మణులు, ఎస్సీలు.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చారు. కానీ తెలంగాణ బీజేపీ బీసీ నేతలకు ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. ఢిల్లీలో కాంగ్రెస్ మహాధర్నా చూసైనా కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు మా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# కాళేశ్వరం కుస్తీ.... ఎవరికి లాభం?



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం.. ఎవరికి మేలు చేస్తుంది? ఎవరికి మైనస్ అవుతుంది?. ఇదీ.. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న చర్చ. అవినీతిని ఎవరూ సహించరు. పైగా నిజంగానే ప్రజాధనం వృథా అయితే.. ఎవరు మాత్రం చర్యలు తీసుకోకుండా ఉండమని చెబుతారు? సో.. ఈ కోణంలో ఆలోచన చేస్తే.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న ప్రకారం..చర్యలు తీసుకోవాల్సిందే. కానీ, ఇక్కడే తటపటాయింపు చోటు చేసుకుంది. ఏ కార్యక్రమం చేపట్టినా.. కొంత నిధులు వృథా అవుతాయి. వాటికి కారణాలు కూడా ఉంటాయి.అంతే తప్ప.. ప్రధాన ప్రాజెక్టే అవినీతి అంటే.. మాత్రం ప్రభుత్వానికి ఇబ్బంది. వాస్తవానికి ఇదే ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు కలిసి వస్తున్న అంశం. తమను ఉద్దేశ పూర్వకంగానే వేధిస్తున్నారని.. కేసీఆర్‌పై కక్షసాధింపు కోసమే ఇలా చేస్తున్నారన్న వాదన బలంగా ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నా రు. నిజానికి తెలంగాణ సాధన తర్వాత.. కట్టిన అతిపెద్ద ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం. దీని నుంచి 2 లక్షల ఎకరాలకు పైగానే సాగు భూమికి నీరు అందుతుంది. అలానే 132 గ్రామాలకు తాగునీరు కూడా అందుతుంది.దీనిని ఎవరూ వ్యతిరేకించడం లేదు. ప్రభుత్వం కూడా.. దీనిపై ఆచితూచి వ్యవహరిస్తోంది. అసలు ప్రాజెక్టే తప్పని ప్రభుత్వం కూడా చెప్పడం లేదు. కానీ, అవినీతి జరిగిందని అంటున్నారు. ఈ అవినీతిని నిరూపించి.. కేసీఆర్ పై చర్యలు తీసుకునే విషయంలో అధికార పార్టీలోనే విబేదాలు పొడచూపుతుండడం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. కాటగారికల్‌గా.. కేసీఆర్ తప్పులు ఎత్తి చూపించినా.. ఆయనపై చర్యలు తీసుకునే విషయంలో కేసీఆర్ ఉన్న ఇమేజ్.. ప్రజల్లో నెలకొన్న సెంటిమెంటు వంటివి అడ్డువస్తున్నాయన్నది కీలక నాయకులు చెబుతున్న మాట.ఒకవేళ.. ప్రభుత్వమే.. కనుక కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ రిపోర్టును అడ్డు పెట్టుకుని కేసీఆర్‌ను అరెస్టు చేయదలిస్తే... దీనిని ఆయన మాత్రం ఎందుకు తేలికగా తీసుకుంటారు?. సీరియస్‌గానే వ్యవహరిస్తారు. ఈ క్రమంలోనే బిగ్ ప్లాన్ దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు. ప్రజల మధ్య ఉండేందుకు ఆయన ప్రణాళికలు చేస్తున్నారు. తద్వారా తన అరెస్టే అనివార్యమైతే.. అది ఇంట్లో కాదు.. ప్రజల మధ్యే జరగాలన్నది ఆయన వ్యూహం. తద్వారా.. తెలంగాణ సాధకుడినే అరెస్టు చేశారన్న సెంటిమెంటును ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ప్రయత్నిస్తున్నారు. సో.. ఈ నేపథ్యంలో కాళేశ్వరం కుస్తీ వ్యవహారం.. కాంగ్రెస్ కంటే కూడా.. బీఆర్ఎస్‌కు లాభించేలా చేసుకునే ప్రతిపాదన అయితే.. తెరమీదికి వస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# మద్యంతోనే పథకాలు గట్టెక్కాలి..కొత్త మద్యం విధానంతో అధిక ఆదాయంపై దృష్టి




అమరావతి,సూపర్ సిక్స్ అమలు కావాలంటే మద్యం బాగా అమ్మాలి. మద్యంతో ఆదాయం పెరగాలి. ఆదాయ వనరులు పెంచుకోవాలి. జగన్ ఏకంగా నకిలీ మద్యంతో ఆదాయాన్ని పెంచుకున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఎపి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీకి పచ్చజెండా ఊపింది. జగన్ హయాంలో బార్‌లలో ధరలను బార్లా తెరిచేశారు. అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారం ధరలు పెంచుకోవచ్చని జీవో ఇవ్వడంతో అడ్డూ అదుపూ లేకుండా మందుబాబుల జేబులను గుల్ల చేశారు. వైసీపీ ప్రభుత్వం ఒకవైపు మ ద్యం ధరలను నూరుశాతం పెంచగా, బార్‌లలో దానిపై మరింత అదనంగా లాగేశారు. క్వార్ట రుకు రూ.50-రూ.70, బీర్‌కి ఏకంగా రూ.100- రూ.120 తీసుకుంటూ దోపిడీ చేశారు. ఐదేళ్లూ ఈ దందా సాగింది.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దోపిడీకి కొత్త మద్యం పాలసీతో అడ్డుకట్ట వేసింది. బార్‌లలో కూడా దుకాణాల్లో ధరలనే అమలుచేయాలని నిర్ణయానికి వచ్చింది. దుకా ణాల కంటే 10 శాతం ఎక్కువ ధర చెల్లించి బా ర్‌లు ప్రభుత్వ మద్యం డిపోల నుంచి కొనుగోలు చేస్తాయి.బార్‌లలో కూడా దుకాణాల ధరే నిర్ధా రిస్తే ఆ శాతాన్ని ప్రభుత్వం నష్టపోవాల్సి ఉంటుంది. దరఖాస్తు రుసుం రూ.5 లక్షలు ఉంటుందని చెబుతున్నారు.మద్యం బార్ల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీకి రూపకల్పన చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో 2022-25 మధ్య అమలైన మద్యం బార్‌ల పాలసీ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం బార్‌ల పాలసీ అమలుకు గ్రీన్‌సిగ్నల్ పడింది. ముందస్తుగా ఈ పాలసీ అమలుకు రాష్ట్రంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి ఆ ఉపసంఘం ఇచ్చిన అధ్యయన నివేదిక ఆధారంగా కొత్త బార్ల పాలసీ అమలుకు శ్రీకారం చుట్టనుంది.ఈ పాలసీలో భాగంగా గీత కార్మికులకు 10 శాతం షాపులు కేటాయించనున్నారు. కొత్త బార్ పాలసీపై అబ్కారీ శాఖ దాదాపుగా కసరత్తు పూర్తి చేసింది. త్వరలో కొత్త బార్‌లకు నోటిఫికేషన్ వెలువడనుంది. జగన్ హయాంలో ఇచ్చిన బార్‌ల లైసెన్స్‌లకు ఈ నెలాఖరుతో కాల పరిమితి ముగుస్తుంది. దీంతో ఈనెల 15వ తేదీలోగా కొత్త బార్‌లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్‌లు అందుబాటులోకి రానున్నాయి. మద్యం దుకాణాల కేటాయింపులో గీతకార్మికులకు ప్రభుత్వం 10 శాతం షాపులు కేటాయించింది. వీరికి లైసెన్స్ ఫీజు సైతం భారీగా తగ్గించింది. త్వరలో బార్ల లైసెన్సుల్లోను పది శాతం కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించింది. జగన్ జమానాలో పిచ్చి బ్రాండ్లతో ఎంత ఆదాయం వచ్చిందో.. ఇప్పుడు దాదాపు 200 రకాల నాణ్యమైన బ్రాండ్లు ఉన్నా అంతే రాబడి నమోదవుతోంది. బీర్లలో పెరుగుదల కనిపిస్తే ఆ మేరకు మిగతా మద్యం బ్రాండ్లలో తరుగుదల నమోదవుతోంది.దీంతో ఆదాయం ఆశాజన కం గా ఉండడం లేదు. దీనిపై ప్రభుత్వం విశ్లేషణ చేయగా పర్మిట్ రూమ్‌లు లేకపోవడమే ఒక కారణమని తేలింది. ప్రస్తుతానికి అనధికారిక సిట్టింగ్‌లను చూసీచూడ నట్టు వదిలేస్తున్నా.. ఆదాయం మెరుగుపడడం లేదు.బార్‌ల లైసె న్స్‌ల మాదిరిగానే పర్మిట్ రూంలకు ఈ సెప్టెంబరు నుంచి అనుమతులిచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది. జిల్లాల్లో2019కి ముందు అన్ని షాపులకు ఏడాదికి రూ.5 లక్షలు ఫీజుగా ఉండేది. ఇప్పుడు దానిని రెండు కేటగిరీలుగా చేయనున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.7.5 లక్షలు, మిగతా ప్రాంతాల్లో రూ.5 లక్షల ఫీజు విధించే అవకాశం ఉంది. మద్యం షాపుల తరహాలోనే బార్లకు లాటరీ తీయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జగన్ హయాంలో వేలం విధానంలో రెండేళ్ల పరిమితికి జారీ చేసిన లైసెన్స్‌లను గడువు ఈ నెల 31వ తేదీతో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త బార్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. లైసెన్స్ ఫీజుల నిమిత్తం రెండు ప్రతిపాదనలను ఎక్సైజ్ శాఖ సిద్ధం చేసింది. నగర పంచాయతీల్లో రూ.35 లక్షలు, మునిసిపాలిటీ-ల్లో రూ.40 లక్షలు, నగరపాలక సంస్థల పరిధిలో రూ.45 లక్షలు మొదలు ప్రతిపాదన కాగా.. వరుసగా రూ.55 లక్షలు, రూ.65 లక్షలు, రూ.75 లక్షలు రెండో ప్రతిపాదనగా ప్రభుత్వం ముందుంచింది. అయితే ఖచ్చితంగా ఒక్కొక్క బారుకు నాలుగు దరఖాస్తులు పడాల్సిందేనన్న నిబంధన ఉంది. ప్రభుత్వం మొదటి ప్రతి పాదనకు మొగ్గు చూపుతుండగా ఆదాయం తగ్గుతుండడంతో ఏంచేయాలో ప్రశ్నార్థకంగా మారింది.

## పొలాల్లోకి దూసుకెళ్లిన పాఠశాల బస్సు

ముదినేపల్లి,ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్దకామనపూడిలో పెద్దప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో స్కూలు పిల్లలు క్షేమంగా బయటపడ్డారు. ప్రైవేటు- పాఠశాల బస్సు ప్రమాదానికి గురైంది. స్టీరింగ్ రాడ్ విరగడంతో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు వెంటనే స్పందించి బస్సు అద్దాలు పగలగొట్టి విద్యార్థులను బయటకు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 27 మంది విద్యార్థులు ఉన్నారు.

# కాంగ్రెస్‌లో టెన్షన్..? కార్యవర్గ పోస్టుల భర్తీ ఎప్పుడు..



హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్‌లో కార్యవర్గాల పదవుల భర్తీ మాత్రం పూర్తి కావడం లేదు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటింది.. పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించి ఏడాది అయింది. అయినా కాంగ్రెస్ పార్టీ పదవుల ఆశావహుల కోరిక మాత్రం తీరడం లేదు.. ఇదిగో అదిగో అంటూ ఊరించిన ఆ ఉరింపులు ఏమయ్యాయి. జూలై నెలాఖరి వరకు పదవులు భర్తీ అంటూ చేసిన ప్రకటనలు ప్రకటనలు గా ఎందుకు మిగిలి పోతున్నాయి..అసలు పదవుల భర్తీ ఉంటుందా ఉండదా..ఉంటే ఎప్పుడూ ఉంటుంది? ఇదే కాంగ్రెస్ పదవుల ఆశావహులను టెన్షన్ పెట్టిస్తోందంట ఇప్పుడు%

భర్తీ కాని కాంగ్రెస్ కార్యవర్గాల పోస్టులు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటిపోయింది. మరో వైపు కొత్త పీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టి 10 నెలలు అవుతుంది. కానీ పార్టీ కార్యవర్గాల పదవులు మాత్రం భర్తీ చేయడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నా%% పార్టీ సంస్థాగత నిర్మాణంపై కాంగ్రెస్ పెద్దలు ఫోకస్ పెట్టడం లేదు. జాతీయ కాంగ్రెస్ నాయకులు వచ్చిన ప్రతి సారి ఈ నెలాఖరు కు లేదా వారం రోజుల్లో పార్టీ పదవుల భర్తీ అవుతుంది అంటూ ప్రకటనలు చేస్తున్నారు కానీ వారి మాటలు నీటి మీద రాతలు లాగానే మిగిలిపోతున్నాయి అంటున్నారు కాంగ్రెస్ నేతలు.

ఉమ్మడి 10 జిల్లాలకు పూర్తైన పార్టీ ఇన్చార్జుల నియామకం

జులై నెలాఖరు వరకు పార్టీ పదవులను భర్తీ చేయాలని భావించింది పీసీసీ. ఇందులో భాగంగా ఉమ్మడి 10 జిల్లాలకు ఇన్ ఛార్జ్ లను నియమించింది. జూలై 15 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి గ్రామా, మండల, జిల్లలో స్థాయి పదవుల కోసం ఒక లిస్ట్ సిద్ధం చేసి ఇవ్వాలని సూచించింది. సూచించడమే కాదు తక్షణమే ఫీల్డ్ లో దిగాలని ఆదేశించింది. లిస్ట్ రూపొందించి ఫైనల్ లిస్టుని గత జూలై నెలాఖరుకి రెడీ చేసి పార్టీ పదవులు భర్తీ చేయాలని భావించింది. దీనికి తగ్గట్లు ఇన్ ఛార్జ్ లు సమావేశాలు నిర్వహించి లిస్ట్ లు సిద్ధం చేశారు..

స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే భర్తీ చేస్తారా?

అయితే పార్టీ ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే పార్టీ పదవులు భర్తీ చేయాలనీ భావిస్తుందన్న ప్రచారం మొదలవ్వడంతో ఆశావహుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు వ్యక్తమవుతున్నాయంట. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే పదవులు ఇస్తే గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఎవరైనా పదవులు రాని వాళ్ళు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తారని కాంగ్రెస్ పెద్దలకు రిపోర్టులు వెళ్లాయంట. దానితో స్థానిక సంస్థల ఎన్నికలలో మెజార్టీ మద్దతు దారులను గెలిపించుకోవడం కష్టం అవుతుందని భావించిన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలో తర్వాతే పార్టీ పదవులు భర్తీ చేయాలని ఫిక్స్ అయిందంటున్నారు.

లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన వారికే పదవులు..

లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో ఎవరు కష్టపడి పని చేస్తారో వారి గ్రామంలో, మండలంలో, జిల్లాలో ఎవరు ఎక్కువ పని చేసి ఎక్కువ స్థానాలు గెలవడం లో కీలక పాత్ర పోషిస్తారో వారికీ పార్టీ పదవులు ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే కాంగ్రెస్ క్యాడర్ మాత్రం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో మీ కోసం పని చేసామని, అయితే ఇప్పుడు లోకల్ ఎన్నికలతో ముడిపెట్టి తమకు పదవులు వాయిదా వేస్తారా అని మండిపడుతోందంట. కాంగ్రెస్ కార్యవర్గాల ఆశావహుల అసంతృప్తి చూస్తుంటే అది స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై రిఫ్లెక్ట్ అవుతుందేమో అని కాంగ్రెస్ శ్రేణులు బిక్కుబిక్కు మంటున్నాయి. మరి ఈ పరిస్థితిని కాంగ్రెస్ పెద్దలు ఎలా చక్కదిద్దుతారో చూడాలి.

## బిసి బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు

న్యూఢిల్లీ,కులగణన ఆధారంగా సామాజిక న్యాయం కోరుతున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దిల్లీలో తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బీసీ ధర్నాపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలనే డిమాండ్‌తో ధర్నా జరిగినట్లు చెప్పారు. కాంగ్రెస్ మహాధర్నాకు రాష్ట్రపతి స్పందిస్తారని ఆశిస్తున్నా. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు అవుతుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com